క్లుప్తంగా

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి



విజయవాడ కల్చరల్: వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్‌రోడ్డులోని లలితా కామేశ్వరీ కల్యాణమండపంలో శుక్రవారం వయోవృద్ధు దంపతులకు పాదపూజ, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. జంధ్యాల శంకర్ మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలు, వారి సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తున్న సంఘం సేవలను అభినందించారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ సేవా సంఘం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 80 మంది వయో వృద్ధులకు పాదపూజ, 120 మంది మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తణుకు రామకృష్ణ, కోశాధికారి పెద్దిభొట్ల కాశీ విశ్వనాథ్, యద్దనపూడి శ్రీరామచంద్రమూర్తి, కొప్పరపు మారుతీ కొప్పరపు ఉమా బలరాం పాల్గొన్నారు.

నగర ప్రజలకు శ్రీకృష్ణజన్మాష్టమి శుభాకాంక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):లోకానికి జ్ఞానాన్ని పంచిన గీతాచార్యుడు అయిన శ్రీ కృష్ణుని జన్మదినోత్సవం సర్వ మానవాళికి పర్వదినమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త , మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మహావిష్ణువు ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణపరమాత్మ స్వరూపమని తెలిపారు. దశావతారాలలో పరిపూర్ణమైనదని పేర్కొన్నారు.

అలరించిన దేశ భక్తి గీతాలు



విజయవాడకల్చరల్: స్వరార్చన సాహిత్య సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన దేశ భక్తి గీతాలు అలరించాయి. తెలుగు సినిమా రచయితలు శ్రీశ్రీ, నారాయణరెడ్డి, సిరివెన్నెల సీతారామ శాస్త్రి,దాశరథి, గుడవల్లి రామబ్రహ్మం రచించిన గీతాలను గాయనీ గాయకులు మధురంగా ఆలపించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సినిమాల్లో వచ్చిన ప్రబోధాత్మక గీతాలు యువతను ప్రభావితం చేశాయన్నారు. కె.డేవిడ్‌రాజు, బి.వీరభద్రరావు, పి.విజయలక్ష్మి, శ్యాం ప్రసాద్, మారేపల్లి జోషి పాల్గొన్నారు. డీజే రాము నిర్వహించారు.

సాయిబాబా మందిరంలో వరలక్ష్మీ వ్రతం



మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేషంగా కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం వరలక్ష్మీ వ్రతం నిర్వహించి వ్రత విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు వరలక్ష్మీవ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీ చక్రార్చన



విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించిన వైదిక క్రతువులు వైభవంగా సాగాయి. వేద పండితులు సామూహిక చక్రార్చన, దేవీ ఖడ్గమాల, అష్టలక్ష్మీ సహితశ్రీ మహాలక్ష్మీయాగం నిర్వహించారు. అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్ మాట్లాడుతూ శ్రీ చక్రార్చన సర్వశక్తి వంతమైనదని తెలిపారు. అది పరాశక్తి శ్రీ చక్రంలో కొలువై ఉంటుందని చెప్పారు. కులమతాలకు అతీతంగా కార్యక్రమంలో అందరికీ అవకాశం ఇచ్చామన్నారు. ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సత్యనారాయణపురంలో మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సత్యనారాయణపురం, శివాజీకేఫ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శార్వణిమూర్తితో కలసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని అవిష్కరించి స్వాతంత్ర ఉద్యమంలో అమరులైన స్వాతంత్ర సమరయోధులను స్మరిస్తూ వారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ములు సాధించిన స్వరాజ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేస్తుందని మండిపడ్డారు. ఇటీవల పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాస్, క్లస్టర్ అధ్యక్షులు భోగాది మురళి, శేషన్ మురళి, కునపులి ఫణి, చాంద్, కొల్లూరు రామకృష్ణ, మల్లిక్, సీతారం, రాము, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలోని గాయత్రి సొసైటీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జొన్నవితుల సుబ్బారావు, శ్రీధర్, మల్లాది రాజేంద్ర, దోనేపూడి శ్రీనివాస్, మారుతీ తదితరులు పాల్గొన్నారు. సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్లో ముఖ్యఅతిథిగా మాజీ సుబేదార్ పాలపర్తి శామ్యూల్ దాసు పాల్గొని చిన్నారులతో కలసి జాతీయ జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్, సెక్రటరీ సుమన్ త్యాగరాజు, ప్రిన్సిపాల్ పావన దీప్తి, అకాడమిక్ కోఆర్డినేటర్ పావని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భరతమాతకు నృత్య నీరాజనం

విజయాడ కల్చరల్:ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని జీవీఆర్ నృత్య సంగీత కళాశాలలో శుక్రవారం ఘర్ ఘర్ తిరంగా, స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ సి.జ్యోతిర్మయి పర్యవేక్షణలో నాట్యాచార్యులు డాక్టర్ సీహెచ్ అజయ్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో, నాట్యాచారిణి భాగవతుల సౌమ్య బృందం భరత నాట్య సంప్రదాయంలో దేశ భక్తి గీతాలకు నృత్యాలను అభినయించారు. సంగీత విభాగం అధ్యాపకురాలు మల్లాది కార్తీక త్రివేణి బృందం భక్తి గీతాలను ఆలపించింది. సంగీత కళాశాల అధ్యాపకులు లక్ష్మీనరసమ్మ, ఫల్గణ్, అమృతకుమార్, స్టీవెన్‌రాజు, శోభాలక్ష్మి, మాధురి పాల్గొన్నారు.



సీతన్నపేట గేటు వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో మల్లాది



బీసెంట్ రోడ్డులో జరిగిన వేడుకల్లో మల్లాది విష్ణు

అవినీతి రహిత సమాజం కోసం యువత కృషి చేయాలని రచయిత్రి నైనాల వాణిశ్రీ తెలిపారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు, నీలం దుర్గారావు, గ్రంథాలయ సత్యం పాల్గొన్నారు. కొత్తా పూర్ణానందం కళావేదిక ప్రాంగణంలో కళా సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు దేశ భక్తి గీతాలు ఆలపించారు.

పాయకాపురం(విజయవాడరూరల్): ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. పాయకాపురం, రాజీవ్‌నగర్లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన స్వాతంత్ర్య దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఆయుర్వేద పరిశోధన సంస్థ అందిస్తున్న సేవలను వివరించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్, డాక్టర్ సవిత పి. గోపాడ్, డాక్టర్ సుజాత పి.ధోకె తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో కనుమరుగైపోతోందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సెంట్రల్ నియోజకవర్గంలోని 36వ డివిజన్ సీతన్నపేట గేటు, 23వ డివిజన్ బీసెంట్ రోడ్డులో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మల్లాది విష్ణు జాతిపిత మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ నేతలు తాడి శివ, మహంతి రమణ, డాలి నాయుడు, కంకిపాటి కృష్ణ, రామారావు, పిల్ల దుర్గారావు, రమేష్, 23వ డివిజన్ నాయకులు చల్ల సుధా,ఆత్మకూరి సుబ్బారావు, విక్కీ, రెడ్డి, సీతారం, పరసా ప్రేమ, తోపుల వరలక్ష్మి, యక్కల మారుతీ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులు ఆ దిశగా ఎదగాలని 64వ డివిజన కార్పోరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ ఆకాంక్షించారు. శుక్రవారం బీవీ సుబ్బారెడ్డి స్కూల్లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆమె పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత మహాత్మాగాంధి చిత్రపటానికి నివాళులర్పించారు. స్కూల్ ఉపాధ్యాయులు ,వైఎస్సార్‌సీపీ నాయకులు యర్రగొర్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. 63వ డివిజన్లో వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ పసుపులేటి యేసు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు రాజీవ్‌నగర్లో జరిగాయి. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన తర్వాత యేసు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మన్నెం జగదీష్, చిన యేసు, తదితరులు పాల్గొన్నారు. సుందరయ్య నగర్‌కట్ట, అంబాపురం మస్జిద్‌-ఎ కరీమున్నీసా నందు వేడుకలు జరిగాయి. అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మసీద్ నిర్వాహకులు హాజి సలీం,ఎండి హాఫీజుల్లాహ్, ఇమామ్ హాఫిజ్ బాయజీద్‌సిరాజి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో....

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య వేడుకలు కేడీసీసీబీ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ, జాతీయ నేతల చిత్రపటాలకు బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకు ప్రగతిని, రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. నాబార్డ్ డీజీఎం మిలిన్ సాలస్కర్, జనరల్ మేనేజర్ రంగబాబు పాల్గొన్నారు. బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.మోహన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వై. నాగేశ్వరరావు, సీహెచ్ గీతాంజలి, ఏవో అబ్దుల్ సత్తార్, సీనియర్ అసిస్టెంట్ దుర్గ భవాని, మరియా మనస్విని, కానిస్టేబుల్ నాగిరెడ్డికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇన్‌చార్జి ఆర్టీఓలు ఆర్.ప్రవీణ్, కె. వెంకటేశ్వరరావు, మోటారు వాహన తనిఖీ అధికారులు వి.పద్మాకర్, వై. నాగేశ్వరరావు, శివరామగౌడ్, జీవీఎస్ఎన్ మూర్తి, ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు యం.రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా స్వాతంత్ర్య వేడుకలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి పాల్గొని గాంధీ చిత్రపటాని పూలమాలలువేసి నివాళులర్పించారు. జాతీయ పతాకం ఆవిష్కరించారు. గ్రంథాలయాధికారి కె రమాదేవి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో భారత మాత విగ్రహానికి పూల మాలలు వేశారు. కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు, ఉప కార్యదర్శి తంగిరాల రఘురాం, కోట శ్రీకృష్ణభగవాన్, జాజి పద్మజ, చిదంబరం, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో చాంబర్ అధ్యక్షులు జీబీవీ రవికుమార్, ఉపాధ్యక్షుడు వీవీకే నరసింహారావు, ఈమని దామోదరరావు, తమ్మన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎగ్జిబిషన్ ఆర్గనైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేశారు. ప్రెసిడెంట్ జి నానయ్య, వైస్ ప్రెసిడెంట్ జి అచ్చయ్య, టి శివ, ఎన్ గోపి, జానకిరామయ్య, శేఖరరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్వాతంత్ర్య వేడుకలు



జాతీయ నాయకుల వేషధారణలో పాఠశాల విద్యార్థులు



గాయత్రి ఫంక్షన్ హాలు వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన మల్లాది విష్ణు



వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న కార్పొరేటర్ షాహీనాసుల్తానా



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ వై.తిరుపతమ్మ



ప్రాంతీయ ఆయుర్వేద సంస్థలో వేడుకలు



కేడీసీసీబీ రీజినల్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన నెట్టెం రఘురాం



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మోహన్

మహనీయుల స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలి



ఫుడ్ జంక్షన్‌లో జెండా వందనం చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



భారతదేశం రూపంలో కూర్చున్న సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మహనీయుల స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. సత్యనారాయణపురం ఫుడ్‌జంక్షన్ సెంటర్‌లో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యాన శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదల శ్రీనివాసరావుతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు. ట్రేడ్ యూనియన్ అధికార ప్రతినిధి బల్లం కిషోర్, వర్మ, శంకర్ రాజు, కావూరి వర ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయంలో జాతీయజెండాను ముద్రణాలయం డీజీఎం ఎల్.మోహన్‌కుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. యూనియన్ నాయకులు నాగవరపు శరత్‌చంద్, ఎన్.సీతారామరాజు, కె. వెంకటేశ్వరరావు, అజయ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి జెండా ఆవిష్కరించారు. చేయూత మానసిక వికలాంగుల శిక్షణా సంస్థ కార్యాలయంలో శుక్రవారం జాతీయపతాకంను కార్పొరేటర్ శర్వాణీ మూర్తి సదరన్ సర్టిఫికెట్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ చార్లెస్, సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణకుమారి ప్రత్యేక చిన్నారులతో కలిసి ఆవిష్కరించారు. దేవీనగర్ కాపుసేవాసంఘం కార్యాయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. 59వ డివిజన్ సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదుట కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు. అనంతరం స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అమిత్, నేరెళ్ల శివప్రసాద్, కోలా శాంతకుమారి తదితరులుల పాల్గొన్నారు. ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సెయింట్ ఆన్స్ స్కూల్‌లో భారతదేశ మ్యాప్ రూపంలో విద్యార్థులు కూర్చొని ఆకట్టుకున్నారు.



భారతమాత వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న అధికారులు



ఎస్ఆర్ఆర్ కళాశాలలో జెండా ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి





సంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాశాల విద్యార్థినులు



హనుమంతరాయ గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు



కళాకారులు నిర్వహించిన కార్యక్రమంలో గాయనీ గాయకులు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో సుబ్బారావు

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ కుబేర హోమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఘనంగా ప్రారంభమయ్యాయి. గోపూజతో ఉత్సవాలు మొదలయ్యాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం శ్రీ లక్ష్మీగణపతి సమేత అష్టలక్ష్మీ కుబేర హోమం భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం భగవద్గీత ప్రవచనాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు...

శ్రీకృష్ణాష్టమి వేడుకలలో భాగంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.



శ్రీ కృష్ణ మందిరంలో శ్రీ లక్ష్మీగణపతి సమేత అష్టలక్ష్మీ కుబేర హోమం చేస్తున్న దృశ్యం



మధురానగర్ శ్రీ కృష్ణమందిరంలో శ్రీకృష్ణుడు

మద్యానికి డబ్బులు లేవన్నందుకు వ్యక్తిపై దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):మద్యం సేవించేందుకు డబ్బులు అడిగితే ఇవ్వలేదని ఓ వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూరాజరాజేశ్వరీపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... న్యూఆర్‌ఆర్‌పేటకు చెందిన చింతకాయల కిరణ్ అనే వ్యక్తి బ్యానర్లు కట్టే పని చేస్తుంటాడు. రోజులానే శుక్రవారం ఉదయం తన ఇంటి సమీపంలోని బడ్డీకొట్టులో సిగరెట్ కొనుక్కొని తాగుతూ పనికి వెళ్లేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా సాయి, మంగి మహంకాళి అనే ఇద్దరు వ్యక్తులు కిరణ్‌ను అడ్డగించి మందు తాగాలి డబ్బులు ఇవ్వమని అడిగారు. నా దగ్గర లేవని కిరణ్ బదులివ్వగా చంపేస్తానంటూ తన చేతిలో ఉన్న కీచేన్‌తో కిరణ్ ముఖంపై దాదాడి చేసి గాయపర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుడమేరు వరద తగ్గుముఖం...



బుడమేరు మధ్య కట్టలో రోడ్డుపైకి చేరిన వరద నీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో వరద ఉధృతిని తగ్గించేందుకుగానూ వరద నీటిని మధ్య కట్టలోని గేట్లు ఎత్తి ఏలూరు కాలువలోకి తరలిస్తున్నారు. బుడమేరులో వరద శుక్రవారం కొంత మేర తగ్గుముఖం పట్టింది. ఇక వరద నీరు తగ్గిపోతుందని సంతోషించేలోపే ఒక్కసారిగా బుడమేరు వరద రోడ్డు పైకి చేరింది. దీంతో స్థానికులు ఆందోళన చెందారు. ఇరిగేషన్ అధికారులు బుడమేరు మధ్య కట్టలోని గేట్లు మూసివేయటం వల్ల ఒక్కసారిగా బుడమేరులో వరద పెరిగింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అధికారులతో మాట్లాడి వెంటనే గేట్లు ఎత్తి బుడమేరులోని నీటిని ఏలూరు కాలువకు తరలించాలని సూచించారు. దీంతో కొంత మేర గేట్లు ఎత్తి బుడమేరులోని వరద నీటిని ఏలూరు కాలువకు పంపించారు. గేట్లు ఎత్తటంతో బుడమేరులో కొంత మేర వరద ప్రవాహం తగ్గింది. అధికారుల చర్యల పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.